

## వేములకు మంత్రి కేటీఆర్ పరామర్శ

వేల్పూర్, అక్టోబర్ 17 : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో పాటు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల శ్రావణ్ కుమార్ రెడ్డి, తక్కుల్లపల్లి రవీందర్‌రావు, రాజేశ్వర్‌రావు తదితరులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వేముల తల్లి మంజులమ్మ చిత్రపటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మంత్రి వేములను వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం చెప్పారు. మంత్రి వెంట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, నాయకులు కోటపాటి నర్సింహనాయుడు, డాక్టర్ మధుశేఖర్,నాయకులు ఉన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఎన్నికల అస్త్రాలు

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో తెలంగాణ భవితకు సోపానం
- వెల్మల్, ఆలూర్ గ్రామాల్లో 'ప్రజా ఆశీర్వాద యాత్ర'



వెల్మల్‌లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి భారీ గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

నందిపేట్/ఆర్మూర్, అక్టోబర్ 17 : తాము చేసిన అభివృద్ధి.. అమలు చేసిన సంక్షేమ పథకాలే ఎన్నికల అస్త్రాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. 'నమస్తే నవనాథపురం'లో భాగంగా మంగళవారం నందిపేట మండలం వెల్మల్, ఆలూర్ మండల కేంద్రంలో 'ప్రజా ఆశీర్వాద యాత్ర' నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. అలాగే వివిధ కుల సంఘ భవనాల కోసం ప్రొసీడింగ్ కాపీలు అందజేశామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఒంటరి మహిళ, వితంతు పింఛన్లు ఇలా చెప్పుకుంటే పోతే అనేక సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ఇచ్చింది కేసీఆర్ అని.. తెచ్చింది తాను అన్నారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో తెలంగాణ భవితకు సోపానమన్నారు.

పెన్షన్లు, రైతుబంధునిధులు పెరగడంతో పాటు సబ్బండవర్గాల సంక్షేమానికి కొత్త పథకాలుఉన్నాయన్నారు. కాం గ్రెస్, బీజేపీ ప్రజాశత్రువులని.. ఆ రెండు పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌ను మళ్లీ ఆదరించాలని.. తనను గెలిపించాలని జీవన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఆలూర్ సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ భోజకళా చిన్నారెడ్డి, ఉప సర్పంచ్ తుమ్మజీ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీమల్లేశ్, సొసైటీ చైర్మన్ తంబూర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సంతోష్‌రెడ్డి, కళ్లెం భోజారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు బోధన్‌లో జాగృతి 'బతుకమ్మ సంబురాలు'

- హాజరుకానున్న జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పెద్ద ఎత్తున ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్, అవంతిరావు తదితరులు

బోధన్, అక్టోబర్ 17: బోధన్ పట్టణంలో ఈ నెల 18న బుధవారం భారత జాగృతి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున 'బతుకమ్మ సంబురాలు' జరుగనున్నాయి. ఈ బతుకమ్మ సంబురాల్లో పాల్గొనేందుకు భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత బోధన్‌కు వస్తున్నారు. బతుకమ్మ సంబురాలతో బోధన్ పట్టణం ఉదయం నుంచి సాయంత్రం రాత్రి వరకు సందడిగా మారనున్నది. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు కల్వకుంట్ల కవిత ఉదయం 9.30 గంటలకు బోధన్‌కు వస్తున్నారు. సాయంత్రం వరకు పలువురి ఇండ్లలో బతుకమ్మలను పేర్చే కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు పట్టణంలో బతుకమ్మలతో కవిత ఆధ్వర్యంలో ఊరేగింపు జరుగుతుంది. ఊరేగింపు అనంతరం సా యం త్రం 6 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వేలాదిమంది మహిళలతో బతుకమ్మ వేడుకలు జరుగుతాయి.

### పెద్ద ఎత్తున ఏర్పాట్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. మైదానం మొత్తం శుభ్రపర్చి, లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. అదే కళాశాల గ్రౌండ్స్‌లో ఉన్న పెద్ద బావిని శుభ్రపర్చి నీటితో నింపారు. వేడుకల్లో బోధన్ శాసనసభ్యుడు మహ్మద్ షకీల్ కూడా పాల్గొంటారు. మైదానంలో ఏర్పాట్లను రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతిరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం రాజీవ్‌సాగర్, అవంతిరావు, బీఆర్‌ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ బతుకమ్మ సంబురాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు జరిగాయన్నారు. జాగృతి బోధన్ నియోజకవర్గం కన్వీనర్ గట్టు హరికృష్ణ, బోధన్ శివాలయం చైర్మన్ బీర్కూర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# మేమంతా స్పీకర్ పోచారం వెంటే..



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

- 300 దళిత కుటుంబాల మద్దతు
- ఏకగ్రీవ తీర్మాన కాపీ స్పీకర్‌కు అందజేత

బాన్సువాడ, అక్టోబర్ 17 : తామంతా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వెంటే నడుస్తామని.. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని భైరాపూర్ గ్రామానికి చెందిన 300 దళిత కుటుంబాల సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు మంగళవారం బాన్సువాడ పట్టణంలో స్పీకర్‌ను కలిసి ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న పోచారం, బీఆర్‌ఎస్ పార్టీని గెలుపించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. తనకు మద్దతు తెలిపిన భైరాపూర్ దళిత కుటుంబాలకు స్పీకర్ పోచారం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు ద్రోణవల్లి సతీశ్, శంకర్ తదితరులు ఉన్నారు.



స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మంగళవారం మోస్రా రామాలయ దర్శనానికి వెళ్లారు. అక్కడే ఉన్న ఓ తల్లి తన కవల పిల్లలతో సభాపతి వద్దకు వచ్చింది. స్పీకర్ పిల్లలను ఎత్తుకొని ఆడించారు. కేసీఆర్ కిట్టు అందిందా వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకు కంటికి రెప్పలా ప్రభుత్వం కాపాడుతున్నదన్నారు.

– మోస్రా (చందూర్), అక్టోబర్ 17

# మంత్రి వేములకు వెల్లువెత్తుతున్న మద్దతు



ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

మోర్తాడ్/ఏర్గట్ల, అక్టోబర్ 17 : రానున్న శాసన సభ ఎన్నికల్లో మం త్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని మండలంలోని వడ్యాట్ గ్రామంలోని గంగపుత్ర సంఘానికి చెందిన 24 కుటుంబాలు మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ఈ సందర్భంగా కుల సంఘాల సభ్యులు మాట్లాడుతూ...గతంలో తమ గ్రామం గురించి ఎవరూ పట్టించుకోలేదని.. కానీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు మం జూరు చేయించారని, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయిం చి విద్యుత్ ఇబ్బందులు దూరం చేశారన్నారు. అభివృద్ధి చేస్తున్న వేముల వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. అనంతరం తీర్మాన పత్రాన్ని బీఆర్‌ఎస్ నాయకులు గంధం మహిపాల్, బాలమల్లేశ్, ఉపసర్పంచ్ మహేశ్‌కు అందజేశారు.

ఏర్గట్ల మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన కృష్ణ యాదవ, రజక, మున్నూరు కాపు సంఘ సభ్యులు మంగళవారం సమావేశం నిర్వహించి మంత్రి వేములకు మద్దతు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గుల్లే రాజేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం, బాల్కొండ నియోజకవర్గ సమన్వయ సభ్యులు గడ్డం లింగారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు నేరెళ్ళ లింగారెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు క్యాతం సుభాష్ రెడ్డి, పార్టీ నాయకులు ముక్కెర దేవన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.